
# ముడిపడిన జీవితాలు

'కల్పవల్లి'



## చిట్టెమ్మ కథ

గుమ్మాలకి పసుపురాసి బొట్లు పెడుతూంటే మూరప్ప వచ్చింది "కొంచెం చల్లమజ్జిగ పోస్తావా, వదినా ?" అంటూ చతికిలబడి ఆ కబురూ ఈ కబురూ చెప్పి మజ్జిగ పట్టుకొనివెళ్తూ అంది, "వదినా, ఇంత ముచ్చటపడి అలంకరిస్తున్నావుగాని కోడలుపిల్లకు నచ్చుతుందో లేదో ? అసలే పట్నవాసంది, పైగా చదువుకున్నది."

"ఎద్దువడిగి గంటలు కడతారా ? వచ్చే పిల్లనడిగి నా యిల్లలంకరించాలా ?" మూరప్ప వెళ్తూంటే గొణుక్కున్నాను చదువుకున్న దయితేనేమి, పట్నవాసందయితేనేమి — నా ఇంటి కొచ్చే మనిషి నా చెప్పుచేతల్లో వడచుకోవాలి ఏదో వెంకడి విషయంలో నా మాట నెగ్గలేదుగాని నేనీ ఇంట అడుగు పెట్టిన్నాటి నుండి నా మాటకి తిరుగుందా ? అత్తగారి నుండి ఇంటి పెత్తనాన్ని ఎంత చాకచక్యంగా చేజిక్కించుకున్నాను ?

పదమూడో ఏట కాపరాని కొచ్చిన నాకీ యింటి పరిస్థితులేమి నచ్చలేదు. అత్తగారి నోటికి అదుపూ ఆజ్ఞ వుండేదికాదు. పెళ్లాం పోరు పడలేక మామగారు కాలం చేసారేమొ ఆవిడకీలోడు ఆడబడుచు — మూరప్ప నత్తవారు పంపించేసారు. ఆయన్ని చూడ్డానికే భయమేసేది. వాకన్నా బారడెత్తు, మెలితిరిగిన మీసాలు ... భోజనాలయ్యాక తాంబూల మివ్వడానికి తప్పనిసరిగా దగ్గిర కెళ్ళేదాన్ని. కిళ్ళీ అందుకొని బుగ్గమీద చిటికెస్తే కందిపోయిందేమోనని తడుముకునేసరికి వీధిలో కెళ్లిపోయేవారు.

ఒకరోజు పాలకుండ తోముతూంటే చెయ్యి జారింది.

"ముదనష్టపుదానా, రోజుకొకటి విరుస్తే ఎవరు కొంటారే ? నీ అబ్బిస్తాడా ? నీ అన్న కొంటాడా?" అత్తగారు తిట్లు ప్రారంభించింది.

"అన్నే కొంటాడు బోడికుండకేనా ఈ శాపనార్థాలు ?" అన్నయ్య గొంతుక వినిపించేసరికి తలెత్తాను "రోజూ యిలాగే తిడుతుందా, చిట్టీ ?"

నేను భయపడుతూ తలూపేను

"ఆ చేతులు కడుక్కొని రా నీతో మాట్లాడాలి."

నేను అన్నయ్య వెనకాతల వెళ్తూంటే అల మీద కొంగు సరిచేసుకుంటూ సణగసాగింది, "పనీపాటులేకుండా పొద్దున్నే వచ్చేస్తాడు చెల్లెల్ని వెనకేసుకురావడానికి"

మాది పొరుగూరే అన్నయ్య వారానికి, పదిరోజులకి ఊర్లో పనున్నప్పుడు చూసి పోతూంటాడు. కాని ఎప్పుడూ యివాళ్టిలాగ ముద్దుల చెల్లెలికి తిట్లు పడుతూంటే రాలేదు.

"చిట్టీ, నువ్విలాగ దద్దమ్మలాగ కూర్చుంటే ఎలాగా ? ఇది నీ యిల్లు ధైర్యంగా జవాబు చెప్పాలి. లేకపోతే మీ ఆయనతో చెప్పి..."

"ఆయనతోనా ?" నా కళ్ళలో భయం తొంగిచూసింది.

"ఆయన కూడా తిడతాడా లేక కొడతాడా, అంత భయపడ్డానికి ?"

"నాతో యిప్పటివరకు ఆయన మాట్లాడ లేదు"

అన్నయ్య కొంచెంసేపు ఆలోచించి అడిగేడు, "చిట్టీ, రాత్రి భోజనం అయ్యాక మీ ఆయనేం జేస్తాడు ?"

"వీధిలో కెళ్తారు," అన్నాను చిటికెవేస్తే కందిపోయే బుగ్గ నిమురుకుంటూ

"ఎప్పుడొస్తాడు ?"

"ఏమొ, నేను లేచేసరికి గదిలో పడుకోనుంటారు"

"మువ్వెక్కడ పడుకుంటావు ?"

"నేను, మూరప్ప..."

"చిట్టీ, ఇవాళ నేను చెప్పినట్టు చెయ్యి. మీఆయన యివాళ రాత్రి వెళ్తూంటే వెంటబడు. నిన్ను తీసికెళ్లకపోతే వెళ్ళనివ్వద్దు. రేప్పొద్దున్న నేను మళ్లీ వచ్చి ఏం జరిగిందో చూస్తాను."

అన్నయ్యలాగెందుకు చెయ్యమన్నాడో అప్ప డర్థంకాలేదు గాని చెప్పేడుకదా అని రాత్రి తాంబూలమిచ్చేక మెల్లగా అన్నాను, "మీతో నన్నుకూడ తీసికెళ్లండి."

"నాతోనా ? నీకేమైనా మతిపోయిందా ?" ఆయన గొంతుక హెచ్చించేసరికి గడగడలాడేను.

అన్నయ్య జ్ఞాపకం రాగానే ధైర్యం తెచ్చుకుని పిడచగట్టుకుపోయిన గొంతుకను సరిచేసుకొని అన్నాను, "నన్ను తీసికెళ్లకపోతే మిమ్మల్ని వెళ్లనివ్వను."

"మీ అన్నయ్య వచ్చాడా ?"

'ఈయన కెలాగ తెలిసింది ?' అనుకుంటూ తలూపేను.

"ఇలాగ చెయ్యమని వాడే చెప్పాడా ?"

మళ్లీ తలూపేను.

"నేను నీ మాట వినకపోతే ?"

"రేప్పొద్దున్న...'

"రేప్పొద్దున్న వచ్చి నా సంగతి చూస్తానన్నాడా ? వాడన్నంతపనీ చేస్తాడు." అన్నయ్యంటే ఆయనకి భయమని తెలియగానే ధైర్యంగా తలెత్తి వన్నే కొరకొరా చూస్తుంటే తల దించుకున్నాను. "పొద్దున్నే వాడెక్కడనుండి వస్తున్నాడో అడగలేకపోయావా ? నువ్వెందు

కడుగుతావు, నీ అన్న కదా? నన్ను వెళ్లనివ్వనన్నావు కదూ, వుండు నీ పని పట్టిస్తాను," అంటూ రెక్కపుచ్చుకు బరబరా గదిలో కీడ్చుకుపోయి తలుపేసేశారు

ఆవాళ్టి తరువాత ఆయన మళ్లీ రాత్రి నన్నొదిలి వెళ్లలేదు ఈ విషయం యింట్లోనే గాక ఇరుగుపొరుగుకి కూడా ఆశ్చర్యం కలిగించింది పందొమ్మిదో శతాబ్దంలో ఉదయించిన ఆరోజుల్లో అంతో యింతో వున్న వ్యక్తి సాని వీధి కెళ్లకుండా యింట్లో పెళ్ళాం కొంగు పట్టుకున్నాడంటే వింతే కదా! అయితే నా అందంతో ఆయన్నాకట్టడం ఏమంత కష్టంకాదని నేను గ్రహించినట్టే అందరికి అర్థమైంది ఇన్ని కష్టాలుపడి, బాధ్యతలు వహించి, కాన్పులతో వడిలిపోయిన శరీరం యాభై పైబడినా ఇప్పుడు కూడా బాగానేవుంటుంది — వయస్సులో బొట్టు కాటుకతో కళకళ్లాడుతూ, వంటినిండా నగలతో ఎంతందంగా వుండేదాన్నో? చూసుకుందికి అద్దమా, పాడా?

చుట్టుపక్కల వాళ్లని ఆశ్చర్యచకితులను చేసిన మరో విశేషం, గయ్యాళి అత్తగారిని, ఆడబడుచుని వశపరచుకోడం ఆయన యింట్లో వుండటం మొదలుపెట్టినదగ్గిర నుండి వాళ్లిద్దరికీ నన్ను తిట్టే అవకాశం తగ్గిపోయింది. రెండు పర్యాయాలు చెవిని తిట్లు పడగానే వాళ్లని హెచ్చరించారు అప్పటినుండి అటునించిటు ఆయన్ని 'చేతకానివాడు' 'మగతనం పోయింది' 'గాజులు తొడిగించుకున్నాడు' — నాకు వినబడేలా అంటూంటే కష్టంగా వుండేది దానికితోడు ఒకటికి రెండుసార్లు మూడేసి నెలల కడుపు పోయేసరికి వాళ్ల ఉసురు తగిలిందేమోనని అనుమానం వేసింది అన్నయ్య వాళ్ల నెలాగైనా మంచిచేసుకోమని చెప్పి వెళ్లాడు. ఏ ప్రయత్నం ఫలించక విసిగెత్తి ఈ మూరప్ప అత్తవారింటికేనా ఎందుకెళ్లదు?' అనుకుంటూంటే మంచి ఆలోచన వచ్చింది, 'ఆయనతో చెప్పి ఆమెను అత్తవారింటికి పంపిస్తే?'

మూరప్ప కాపరం మూణ్నాళ్ళ ముచ్చటవడానికి పెద్ద కారణమంటూ లేదు ఆమె అత్తవారు వున్నవాళ్ళు కాదు పిల్లడు చదువుకుంటున్నాడు కదా అని మా మామగారు చేసేసారుట మూరప్ప వెళ్ళేసరికి కోమటి కొట్లో లెక్కలు చూసేవాడుట ఈమె వెళ్లిన కొన్నాళ్ళకే కోమటికొట్టు దివాలా తియ్యడంతో భర్త ఉద్యోగం పోయింది, వాళ్ళ పల్లెటూర్లో మళ్లీ పని దొరకలేదు కోడలింటికి రాగానే యిలా జరిగింది కాబట్టి కోడలు నష్టజాతకురాలంటూ నానామాటలని పంపించేసారు ఇంటికొచ్చి నాడపిల్ల సంగతి యిక్కడా ఎవరూ పట్టించుకోలేదు — మామగారు పోయారు, ఆయనసలింట్లో ఏం జరుగుతున్నదో తెలుసుకునే ప్రయత్నమెప్పుడూ చెయ్యలేదు లేకపోతే 'వున్న ఊర్లో ఉద్యోగమంటే యెక్కడ దొరుకుతుంద'ని ఆమె భర్తకి నచ్చజెప్పరా?

అవేళ రాత్రి పడకగదిలో అన్నాను, "మీ చెల్లెల్ని అత్తారింటికి పంపిద్దామా?"

"అత్తవారింటికా? నీకు తెలియదా చిట్టీ, మూరప్పను వాళ్లు పంపించేసారు?"

"తెలుసు — కాని ఆమె భర్తకుద్యోగం వేయిస్తే..."

"నీకెందుకొచ్చిన బాధ?" మాటలతో కాలం దొర్లించడం యిష్టంలేనట్లన్నారు.

"ఆడబడుచు బాధ నాకు కాకపోతే యింకెవరికి?"

"ఓ అదా సంగతి," నవ్వుతూ అన్నారు.

ఆయన మర్నాడే వెళ్లి ఆమె భర్తకు నచ్చజెప్పి ఈ ఊరి ఎలిమెంటరీ స్కూల్లో మాస్టరుగా వేయించేరు మళ్లీ చీర, సారె పెట్టి భర్త దగ్గిరకి పంపడమేగాక అత్త, మామల పోరు లేకుండా చేసినందుకు మూరప్ప చాలా సంతోషించింది ఇప్పటికీ అంటుంది "నేను పిల్ల, పాపతో వున్నానంటే నీ చలవ, వదినా." ఆమె భర్తిప్పుడు హెడ్‌మాస్టరు

కూతురు కాపరం చక్కబెట్టినందుకు అత్తగారి మెప్పు కూడా పొందాను అందుకే ఈసారి కడుపులో ఉంటే అపురూపంగా చూసింది. తీరా ఆడపిల్ల పుట్టేసరికి విసుక్కుందిగాని ఆవిడ పేరు నామకరణంలో వ్రాయించగానే మురిసిపోయింది. సత్యవతి పుట్టినప్పుడు బాధపడుతూ అంది, "మనవణ్ణెత్తుకున్న తరువాత కాశీ వెళ్దామనుకున్నాను నాకా అదృష్టమున్నట్లు లేదు"

ఆవిడకి కాశీ యాత్ర కోరికని తెలియడమే తడువు ఆయనతో చెప్పి ప్రయాణం కట్టించేను ఆవిడ వెళ్తూంటే అన్నాను, "కాశీ నుండి వచ్చేసరికి మనవడు పుడతాడు."

"నీ నోటి చలవుంటే వస్తానేమో. లేకపోతే కాశీ కెళ్ళినవాడు కాటికెళ్ళినవాడితో సమానం."

"అంత మాటనకండి," అన్నాను గాని అంతపనీ జరిగింది, ఆవిడ తిరిగి రాలేదు

అన్నీ సవ్యంగానే జరిగాయి, అనుభవించే అదృష్టమే లేకపోయింది సత్యవతి తరువాత

## మళ్లీ మళ్లీ

ఘడియ ఘడియకూ
కాలాన్ని వెనక్కి నెడుతూన్న
గడియారపు ముల్లు
వచ్చిందార్లోకే వెళ్తోంది మళ్ళీ.

తూరుపు గర్భంలోంచి తొంగిచూసే సూర్యుడు
నిన్న పుట్టిందెక్కడో మరచినట్లు
ముందుకొస్తున్నాడు.

పొంగే జలధీ, విరిసే కౌముదీ
ఎప్పటిలాగే గతాన్ని నెమరేస్తున్నాయి

మనుషులు — పుడుతున్నారు, ఛస్తున్నారు
ఎప్పటికప్పుడూ ఏదో కొత్తదనం
అనుభవిస్తూ,

ప్రకృతిలో ప్రతిదీ పునశ్చరణమన్నది మరిచిపోతూ

— వెంకట్రావు

# ముడివడిన

ముగ్గురు మొగపిల్లలు పుట్టి పోయేరు. మొగపిల్లడు పుట్టడేమోనని బాధపడుతూంటే వెంకడు కడుపులో పడ్డాడు. పుట్టబోయే బిడ్డ మొగవాడు కావాలని, బతికి బాగుండాలని ముక్కోటి దేవతలకి మొక్కుకున్నాను. దేవుడు నా ప్రార్థన నాలకించి వాడినిచ్చాడుగాని ఏడాది తిరక్కుండా ఆయన్ని తీసుకుపోయాడు.

కొంగుతో కళ్ళద్దుకుంటూ లేచాను. ఇంకా దేవుడింటి గుమ్మానికి ముగ్గులు పెట్టాలి. ఏదో యింత మిగిల్చిపోయారు కాబట్టి సంసారం గుట్టుగా ఈడ్చుకొచ్చాను. ఆడపిల్లలిద్దరికీ మంచి సంబంధాలు చూసి పెళ్ళి చేసాను. వెంకడికి కూడా... వాడి పెళ్ళి విషయంలో నా మాట చెల్లలేదు. పట్నంలో పుట్టిపెరిగి, చదువుకుంటున్న పెద్దింటి పిల్ల అణుకువగా ఉంటుందా? "జానకి నాకు బాగా తెలుసును. చాలా నెమ్మదస్తురాలు, రెండు రోజులు నీ దగ్గిరుంటే నీకే తెలుస్తుంది, అమ్మా," అంది సత్యవతి. అదేగా సంబంధం తెచ్చింది — దాని మాట కాదనలేను వెంకడి చదువు కూడా దానిపట్టే. స్కూలుఫైనలయ్యాక ట్రైనింగ్ చేయించి మాస్టరుగా వేయిస్తే యిక్కడే యిల్లు — నాకిది చూస్తూంటాడంటే కాదని, అది, దాని భర్త విశాఖపట్నం తీసికెళ్ళి కాలేజీలో చేర్పించారు. హాస్టలో, పాడో — అక్కడ తిండి పడక వేరే గది తీసికొని చేతులు కాల్చుకుంటున్నాడు. ఏదో బి యె. అయిపోతుందనుకుంటే యింకా అదేదో ఎమ్ ఎ చేస్తాడట. ఈ చదువుల కంతముండదు కాబోలు. శ్రావణ మాసం, పండుగకి కోడలు వస్తుంది రమ్మంటే క్లాసులు పోతాయి, రానని కబురు పెట్టాడు పైగా చదువైతేగాని పెళ్ళెందుకు చేసావంటాడు. ఇరవయ్యేళ్ళొస్తూంటే యింకా పెళ్ళి చెయ్యరా? కాని ఈ పిల్లని... సత్యవతందికదా అని చెయ్యకుండా ఉండవలసింది. చిన్నప్పటినుండి దాని కెదురు చెప్పలేను. అమ్మ పేరు చేర్చి పెట్టుకున్నాను కదా — పైగా అది అచ్చు నాలాగుంటుందంటారు. పెద్దదానిక్కూడా నా రంగు వచ్చింది కాని వెంకడు వాళ్ళ నాన్నగారి లాగ నల్లగా, పొడుగ్గా... పెళ్ళిలో జానకి పక్కన... బంగారుతీగలాగుంది పెళ్ళికూతురు. అన్నట్టు వాళ్ళు వచ్చే వేళయింది, నేనెదురు వెళ్తే బాగుండదు, మూరప్పను రమ్మనాలి. చేతులు కడుక్కుందికి పెరట్లో కెళ్ళాను.

## జానకి బాధ

"జానకీ, పాలు అబ్బాయికేనా? వెంకడికి పంచదారెక్కువ కావాలి."

'పెళ్ళై రెండున్నరేళ్ళైంది, ఆయనెంత పంచదార వేసుకుంటారో తెలియదా?' మనస్సులో అనుకున్నాను. జవాబు చెప్పడం అలవాటు లేదుగాని అన్ని విషయాల్లో జోక్యం కలిగించుకుంటూంటే చికాకేస్తుంది. అయినా మెల్లిగా అన్నాను, "పంచదారెక్కువే వేసాను."

అడుగులో అడుగు వేస్తూ ఆయన గదివేపు నడిచేను. వారం రోజుల సెలవలకొచ్చిన భర్త దగ్గిర కెళ్తున్నప్పుడుండవలసిన ఉత్సాహమెక్కడా

## జీవితాలు

లేదు. తలుపు మెల్లిగా తెరిచేను...అనుకున్నట్లుగానే మంచంమీద కూర్చొని పుస్తకాలతో కుస్తీ పడుతున్నారు. నన్ను చూడగానే యిబ్బందిగా కదిలి పెదవులమీద చిరునవ్వుని బలవంతాన తెచ్చారు. పాలగ్లాసందుకుంటూ, "పరీక్షలు దగ్గరకొచ్చాయి," అని నేనడక్కుండానే సంజాయిషీ యిచ్చి నన్ను పడుకోమన్నట్లు పక్కకు జరిగి మళ్ళీ పుస్తకాల్లో మునిగిపోయారు.

రెండు నిమిషాలలాగే చూస్తూ నిలబడ్డాను. ఏప్రిలు నెలలో అయే పరీక్షలకి డిశంబరు నెలనుంచే మొదటిరోజు కూడా భార్యనే పు చూడనంత చదవాలా? ఎప్పుడూ యింతే. నెమ్మదిగా మంచమెక్కాను. అసలు చీమూ, నెత్తురు వున్న మనిషేనా? ఆడపిల్ల పక్కనున్నా చలనముండదేమి? ఇన్నేళ్ళలో పట్టుమని పదిసార్లైనా దగ్గరకు తీసారో లేదో. దీని భాగ్యానికి పిల్లలింకా పుట్టలేదని అత్తగారి పోరొకటి. మేము కలిసేదే కాలేజికి సెలవలిస్తేనే— అదీ ఆయన ప్రైవేటు క్లాసులు మినహాయిస్తే. పోనీ గది ఎలాగా తీసికొన్నారుకదా, నన్ను తీసికెళ్ళ కూడదా? పెళ్ళైన కొత్తల్లో నాన్నగారి మాటంటే చదువు పాడవుతుంద నిష్టపడలేదు కాని పెళ్ళామంటూ నన్ను తీసికెళ్ళడానికి సిగ్గేమో ననిపిస్తుంది. ఈ మనిషి కావిడ మళ్ళీ పెళ్ళి చేస్తుందిట.. నేను గొడ్రాలినిట ... ఒక్క కొడుక్కి సంతానం కలగకపోతే వంశం నాశనమయి పోతుందిట ... యింకా...

నా అక్కసంతా ఎవరిదగ్గిర వెళ్ళబోసుకోనేది? నాన్నగారికి చూచాయగా తెలిసింది. వెంటనే నా పరిస్థితి స్పష్టంగా వ్రాస్తే తీసుకు పోతానంటూ ఉత్తరం వ్రాశారు. నేను జవాబివ్వలేదు, ఆ కోపిష్టి మనిషన్నంత పనీ చేస్తారని. అప్పుడప్పు డెదురుపడుతూంటేనే ఈయన నరసిలాగుంది, పుట్టింటి కెళ్ళిపోతే నన్ను మరిచిపోయి, ఆవిడ మరొక పిల్లని తెచ్చి 'తాళి కట్టరా' అంటే కట్టేస్తారేమో. తరువాత ఆమెను కూడా కావలిస్తే నన్నుంచినట్లే దూరంగా వుంచుతారేమో ... ఇక్కడి నుండి వెళ్ళిపోతే నా గతేమిటి? మొగుడొదిలేసి నాడపిల్లకి మన సమాజంలో స్థానమేది? పోనీ ఫ్యాకలు ఫైనలైనా పూర్తిచెయ్యనివ్వలేదే? ఎలాగా ఆయనిక్కడుండరుకదా, ఆ ఏడాది పూర్తిచెయ్యనివ్వమని శ్రావణమాసం పండుగకు తీసికొచ్చినప్పుడు నాన్నగారడిగితే అత్తగారు ససేమిరా అన్నారు.

"అబ్బాయి సెలవలకి యిక్కడికొచ్చేది మా యింటికే వస్తాడు ఈ ఏడాది పరీక్షిచ్చిందంటే ఫ్యాకల్టీ ఫైనలైపోతుంది," నాన్నగారు నచ్చజెప్పబోతే, ఆవిడన్నారు, "కొత్తకోడలు— ముద్దూముచ్చటా తీర్చుకోకుండా మీ యింట్లో వుంచేయడమేమిటి, అన్నయ్యగారూ? అయినా సదువుకొని ఊళ్ళేలాలా? ఏదో భగవంతుడిచ్చిన దింతుంది — నాకు మాత్రం వాడొక్కడేకదా?"

ఆయనొక్కరవడమే నాకీ బాధంతా — సనపురూపంగా కన్న కొడుకుని నేనెక్కడ వలలో

> ### యంత్రం
>
> కనీసం నీ గుండె 'టీ' స్పూనైనా కాదు?
> నీ కొలతలకి
> నా గుండె సముద్రం ఎలా అందుతుంది?
> నీ కళ్ళు నువ్ తినే స్వీట్లు పళ్ళేల్లానైనా లేవు,
> కనీసం నువ్ నడిచే గచ్చుల్లానైనా లేవు —
> సమస్త గోళాన్ని కడుపులో దాసుకున్న
> నా దృగ్గోళం నీకెలా అర్థమవుతుంది?
> ప్రకృతి మనస్తత్వాన్ని
> ఏ కోణంలోంచి గమనించినా తెలుస్తుంది,
> అచ్చమైన హృదయం ఎప్పుడూ
> భౌతిక ధర్మాన్ని ప్రదర్శించదు.
> సజీవ ఎయనాలెప్పుడూ
> నిర్వచనాల రాంపిని చిమ్మవు.
> ప్రపంచ సత్యంలోనే వుంది —
> ప్రాణమనేది స్థిరరూప పరిమితమైందికాదని!
> నదులు సముద్రాలవ్వొచ్చు.
> సముద్రాలు మేఘాలవ్వొచ్చు.
> మేఘాలు మళ్ళీ నదులవ్వొచ్చు
>
> — నందిని సిధారెడ్డి

వేసుకుంటానేమోనని భయమావిడకి. కళ్ళు విప్పాను. ఆయనకి నా ధ్యాసే లేదు. ఈ చదువైపోతే కూడా యిలాగే వుంటారా? ఎక్కడైనా ఉద్యోగమొస్తే తీసికెళ్తారా లేక యిక్కడే అత్తగారి దగ్గిర...

"ఇంకా నిద్రపట్టలేదా? లైటు డిస్టర్బ్ చేస్తున్నాదేమో నేనవతలకి పోయి చదువుకుంటాను," ఆయన మాటలకి ఆలోచనల నుండి తేరుకొని అన్నాను, "నాకేమి యిబ్బందిలేదు బయట చలిగా వుంది, మీరు వెళ్ళొద్దు"

ఆయనవతల కూర్చుంటే హాయిగా నేనాయన మంచంమీద పవ్వళించేనని అత్తగారికి తెలుస్తే? ఏమనుకున్నారో పుస్తకాలు పెట్టేసి లైటార్పి పక్కన జేరేరు

## వెంకటేశం గాథ

సముద్రం మీద ఉవ్వెత్తున లేస్తున్న కెరటాన్ని చూస్తూ కూర్చున్నాను. చీకటి అలుముకుంటున్నది. ఇంటి కెళ్ళేమిటి చేస్తాను? నేను, అమ్మ ... నేను చవటనవడానికి కారణం అమ్మేనేమో. లేక లేక పుట్టడంతో కాలు కింద పెట్టనివ్వలేదు. స్కూలుక్కూడా ఫస్ట్‌ఫారందాకా పంపలేదు. అక్కయ్యిద్దరికీ పెళ్ళిళ్ళైపోతే ఇంట్లో నేనొక్కడినీ ... ఒంటరితనం దూరం చేసుకుందికి పుస్తకాలతో నేస్తం కట్టాను. సత్యవతక్క ధర్మమా అని పల్లెటూరి నుండి బయటపడి అమ్మ బారి నుండి తప్పించుకున్నానుగాని నలుగురితో కలియడం అలవాటులేని నాకు కాలేజీ జీవితంలో కూడా పుస్తకాలే స్నేహితులుగా మిగిలేయి. చదువుమీద శ్రద్ధ నన్నొక ఫస్ట్‌క్లాసు స్టూడెంట్ చెయ్యడంతోపాటు 'టోటల్ ఇంట్రోవర్ట్'గా ... వాడుక భాషలో చెప్పాలంటే ఒంటెత్తువాడిగా వదిలిపెట్టింది నా ప్రపంచం నావరకే సీమితం, ఎవరితో మాట్లాడాలంటే, ఎవరినైనా కలియాలంటే బిడియం, జంకు. ఆఖరికి జానకితో...

జానకి ఎదురుపడితే కలిగే బెరుకును కప్పిపుచ్చుకుందికే పుస్తకాలు ముందేసుక్కూర్చునే వాణ్ణి. చదువు వంకబెట్టి సాధ్యమైనంత వరకు యింటికి వెళ్ళేవాడినికాదు ఉద్యోగం వచ్చాక ఒంటరిగా వుంటే లోకులేమనుకుంటారన్న భయంకొద్దీ తప్పనిసరిగా తీసుకురావలసి వచ్చింది అసలు నేను పెళ్ళే వద్దంటే బలవంతాన ఒప్పించారు సత్యవతక్క, బావ. అయితే జానకిని తప్పించుకు తిరగడానికి వేరే కారణముంది

మొదటి రాత్రి జానకి అందానికి దిగ్భ్రమ చెందాను. మేలిమి బంగారు రంగు, పొడుగుగాక, పొట్టిగాక, నాజూకుగా మోకాళ్ళవరకు వేలాడుతున్న జడతో గదిలో ప్రవేశించినామెను చూస్తూ ఎంతసేపుండిపోయానో నాకే తెలియదు నుదిటి మీద కళ్యాణం బొట్టు, పెద్ద పెద్ద కాటుక కళ్ళు, బుగ్గమీద నల్లచుక్క, మొనదేలిన ముక్కు, ఎర్రటి దొండపళ్ళలాగ పెదిమలు. పందిట్లో నన్నాయి మేళం ధ్వనిలో సన్నగా వినిపించిన మాటలు గుర్తొచ్చాయి. "కాకి ముక్కుకి దొండ పండు..." ఆమె చేతిమీద వేసిన నా చెయ్యి నల్లగా అసహ్యంగా కనిపించింది. గబుక్కున వెనక్కి తీసేసుకున్నాను. అది మొదలు, ఆమెను చేరినప్పుడల్లా అదొక భావం .. అయితే నాలో తలెత్తిన 'ఇన్‌ఫీరియారిటీ కాంప్లెక్స్' మా జీవితాన్ని వేరు చేసేదాకా లాక్కొస్తుందని కలలో కూడా అనుకోలేదు నన్ను నేను కించపరుచుకోవడంవలన జానకిని చేరదీయలేకపోయేవాడిని కాని నా ప్రవర్తనతో ఆమెను బాధిస్తున్నానని, పిల్లలు పుట్టని కారణంగా అమ్మామెను అనరాని మాట లంటున్నాదని, నాకు మళ్ళీ పెళ్ళిచేసే ప్రయత్నంలో కూడా ఉందని నాకా రోజు మామగారొచ్చి నామీద అభాండం వేసి, అప్పటికప్పుడామెను తీసుకు పోయేదాకా తెలియదు

ఆ రోజు సాయంత్రం ఇంటికెళ్ళేసరికి మామగారు వచ్చి ఉన్నారు నేను గుమ్మంలో అడుగు పెడుతూంటే అమ్మంటున్నాది, "మీ అమ్మాయి కాపరానికొచ్చి నాలుగేళ్ళవుతున్నాదా, వంశోద్ధారకుడు పుట్టే సూచనలెక్కడా లేవు."

"మీవాడు చేతకానివాడైతే మా అమ్మాయేం జేస్తుంది?"

"ఏమంటున్నారు?"

"మీవాడు ఇంపొటెంట్ ...' అదే.. మగవాడు కాని వాడితో ఎన్నాళ్ళుంటేనేమిటి? జానకీ, యిలాంటి ఘర్షణ పడుతున్నావని వ్రాయలేదేమి? వెంకటేశంకి మళ్ళీ పెళ్ళి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తే చూసిపోదామని వచ్చాను నువ్వు తెలియజేస్తే ఎప్పుడో తీసుకుపోదును. పోని, ఇక్కడింకెందుకు, పద," మామగారు గొంతుక హెచ్చించారు

"నేను 'యింపొటెంట్'నా?" ఆశ్చర్యంగా

[ 42వ పేజీ చూడండి ]

# ఎవరో రావాలి

ఎటు పయనిస్తోంది దేశం ?
ఏ ప్రళయాగ్నికి ఆహుతవుతుందో దేశం
గాంధీజీ కలలుగన్న రామరాజ్యమిదేనా ?
చాచాజీ చిరకాల వాంఛ, శాంతి రాజ్యమిదేనా ?
దేశాన్ని రాజకీయాస్త్రాలతో వధిస్తున్న ఈ మనుషులు
భగత్, ఆజాద్‌ల రుధిరంతో తడిసిన ధరణిలో
ద్వేషం విషమై వాహినులై పారుతున్నది.
గుప్తుల స్వర్ణయుగం చవిచూచిన పృధ్విలో
ధనమంతా కొందరి హస్తాల్లో గుప్తమై పోయింది
ధర్మప్రభువు అశోకుడు రాజ్యమేలిన అవనిలో
నిరుద్యోగం, అరాచకం పిచ్చిమొక్కలు మొలిచినాయి
ఈ దేశంలో మనగలుగుతుందా స్వతంత్రం
ఎక్కడ చూసినా విహరిస్తోంది, రాజకీయ కుతంత్రం
అందుకే, ఏ నెపోలియనో, హిట్లరో జన్మించి,
విప్లవాగ్ని రగిలించి, దేశాన్ని మండించాలి.
లేదా, ఏ గాంధీయో, గౌతముడో దిగివచ్చి,
శాంతిధారలు కురిపించి, క్రాంతి మార్గాన నడిపించాలి
ఎవరో రావాలి, భరతమాతకు పునర్జీవితం ప్రసాదించాలి

యం. నాగేందర్

# ముడివడిన జీవితాలు

[ 21వ పేజీ తరువాయి ]

అమ్మ మొహం చిట్లించి అక్కడినుండి వెళ్లిపోయింది నేను సావకాశం ఉత్తరం చదువుకున్నాను. మొదటి పేజీలో నన్ను క్షమించమని వేడుకోవడంతోనే సరిపోయింది నేననుకున్నట్లుగానే వాళ్ల నాన్నగారి ముందు నోరు విప్పడానికి భయంట అసలు విషయం ఆఖరున వ్రాసింది, "మీరు తండ్రి కాబోతున్నారు ఈ శుభవార్త ముందుగా మీకే తెలియజేసాను మీరు నన్ను క్షమించి యిక్కడికి వస్తే యింట్లో చెప్తాను. లేకపోతే ." ఏమిటి చేస్తుందో వ్రాయలేదు. ఉత్తరం మడతపెడుతూంటే అమ్మ పాలు పట్టుకొచ్చింది

"అమ్మా, మీ కోడలు నెల తప్పిందిట." సంతోషాన్ని పంచుకోడానికి ఎదురుగా అమ్మే కనిపించింది

జానకివైపు చూశాను. ఆమె బెదురు చూపులు చూస్తుందిగాని నాకే లోటులేదని చెప్పదేం? ఆమెకసలు వాళ్ల మాట అర్ధమవుతున్నాయా లేక ఆమె కూడా ... మౌనం వహించిన ఆమెపై పట్టలేని కోపం వచ్చింది

జానకి తప్పలేదేమో ... మామూలుగానే ఆమె జవాబు చెప్పగా వినలేదు, అటువంటిది వాళ్ల నాన్నగారు గర్జిస్తుంటే, అమ్మ అరుస్తూంటే ఏమంటుంది ? నేనే అనుకుంటే నాకన్నా ముభావంగా వుండేది. ఆమెలో ఉత్సాహం చూసింది కేవలం యింటికి పంట కోతల వేళంటూ అమ్మ వెళ్లిన రెండు నెలలే. సరదాగా మనసువిప్పి మాట్లాడుతూంటే నేను కూడా ఆమెను అందమైన బొమ్మగా గాక మనిషిగా చూడటం, నిర్మలమైన మనస్సులో నన్నే ప్రేమిస్తున్నారని తెలుసుకున్నాక ఆమెను ప్రేమించడం అప్పుడే నేర్చుకొన్నాను. ఆమెనింకా పూర్తిగా అర్థం చేసుకోకుండానే అమ్మ రావడం, వారం తిరక్కుండా ఈ గొడవ, ఆమె వెళ్లిపోవడం జరిగిపోయాయి

బాగా రాత్రయాక తప్పనిసరిగా యిల్లు చేరేను భోజనమయి గదిలో కెళ్తూంటే అమ్మ ఒక కవరు తెచ్చిచ్చి అంది, "మరిచిపోయాను, ఏకేదో ఉత్తరం వచ్చింది "

కవరు మీద వ్రాసినవారి పేరు చూడగానే ఆశ్చర్యంగా విప్పి గబగబా చదవసాగాను

"ఎక్కడినుండిరా, వెంకూ ?"

"మీ కోడలు వ్రాసింది "

"జానకా ? ఏమని ?"

"చదవందే ఎలాగ తెలుస్తుంది ?"

నా మాటల్లో విసుగు ధ్వనించిందేమో,

"జానకి రాసిందా? మీ మామగారు రాయలేదేమి ?"

"జానకింకా ఎవరికి చెప్పలేదుట."

"అదేమిటి ?" అని ఏవో లెక్కలు కట్టి అడిగింది, "వెళ్ళి ఎన్నాళ్ళైంది ?"

"నెల దాటిందేమో," అన్నాను అమ్మ ఉద్దేశం గ్రహించడానికి ప్రయత్నిస్తూ.

"నేనప్పుడే రెండు మూడు నెలలైపోయిందనుకున్నాను. పోనీలే సంతోషం, వెంకూ," అంటూ వెళ్ళిపోయింది

అమ్మ మాటల్లో భావం మనస్సుని కలవర పెట్టింది అమ్మకే అనుమానమొచ్చినప్పుడు, నన్ను ఇంపొటెంటన్న మనిషేమంటారు ? అందుకే జానకి నన్ను రమ్మందా ? కోపంలో కూతురి శీలాన్నే శంకిస్తున్నారని మరిచిపోతారనుకుందా ? నాకు మాత్రం సంశయం ఏ కోశానా లేదు. ఆమె వెళ్ళిన మర్నాడే ఎందుకైనా మంచిదని డాక్టరుచేత పరీక్ష చేయించుకున్నాను పైగా ఆమె వ్రాసిన లెక్కప్రకారం పున్నమినాటి రాత్రి.. అమ్మ రెండు రోజుల కొస్తుందనగా... ఆ రోజు ఎర్రంచు తెల్లచీరలో జానకి మల్లెపువ్వులాగ .

కాని నన్నవమానించిన మామగారింటికెలాగెళ్తాను ? మళ్ళీ ఇన్‌సల్ట్ చేస్తే ? జానకి మళ్ళీ నోరు విప్పకపోతే ? నేను సందిగ్ధంలో పడ్డాను.

ఉత్తరానికి నా వద్దనుండి జవాబు రాకపోతే ఏ అఘాయిత్యమేనా తలపెడుతుందేమోనన్న ఆలోచన రావడం, వెంటనే రమ్మని మామగారి నుండి టెలిగ్రాం రావడం ఒక్క రోజే జరిగేయి నేననుకున్నంతా అయింది. ఎక్కడనుండి జానకి అంత నల్లమందు సంపాదించిందో ? వెంటనే వాళ్ళమ్మగారు చూసేరు కాబట్టి సరిపోయింది నేను వెళ్ళేనాడే ఆసుపత్రినుండి తీసుకొచ్చారు

"నాయనా, అమ్మాయి తెలివొచ్చిన దగ్గిరనుండి నిన్నే పలవరిస్తున్నాది," జానకి మంచం దగ్గిర కూర్చున్న వాళ్ళమ్మగారు అన్నారు, "పంతాలకిపోయి అమ్మాయి మనసులో ఏముందో తెలుసుకోలేదీయన పోనీ, అదైనా చెప్పొద్దూ ? ఇప్పుడు డాక్టరంటున్నారు ."

ఆమె చెప్పటానికి సంశయిస్తున్న విషయమేమిటో గ్రహించిన నేను మెల్లగా అన్నాను, "నాకు తెలుసు జానకి వ్రాసింది."

దూరంగా తలొంచుకు నిలబడ్డ మామగారు గబగబా వచ్చి నా చేతులు పట్టుకొని అన్నారు, "నన్ను క్షమించు, వెంకటేశం. కోపంలో కూతురి జీవితం నాశనం చేస్తున్నానని తెలియలేదు అమ్మాయికి మూడవనెల..."

అప్పుడే జానకి కళ్ళు విప్పింది. నేను మంచం దగ్గిరగా వెళ్లి కళ్ళతోనే అడిగేను, 'ఆలస్యంగా వచ్చినందుకు నన్ను క్షమించవూ ?' ఆమె జవాబుగా చిన్నగా నవ్వింది. "మనం జీవితం కొత్తగా ప్రారంభించుదాము." నేను అస్పష్టంగా గొణుగుతూంటే స్కూలు నుండి ఆఖరి బావమరిది వచ్చేడు, "భారతదేశానికి స్వాతంత్ర్యం వచ్చిందిట – స్కూల్లో లడ్డూలు పంచిపెట్టారం"టూ

ఆంధ్రపత్రిక
ఆదివారం
అనుబంధంలో
★ విజయవాడ, మదరాసు, హైదరాబాదు సినిమా వార్తలు
★ ప్రేక్షకుల తీర్పు
చదవండి!